క్లుప్తంగా

జీఎస్టీ 2.0 పై విద్యార్థులకు అవగాహన



శిరివెళ్ల: జీఎస్టీ 2.0తో ధరలు తగ్గాయని ప్రిన్సిపాల్ డాక్టర్ ఇంద్రాణి అన్నారు. శుక్రవారం యర్రగుంట్ల డిగ్రీ కళాశాలలో జీఎస్టీ 2.0పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ధరలు తగ్గుదల వలన ప్రజలకు ఊరట లభించిందన్నారు. 375 రకాల వస్తువుల ధరలు తగ్గాయని ప్రధానంగా మెడిసిన్, సిమెంట్ ధరలు తగ్గాయన్నారు. తగ్గింపుతో ఆర్థిక వ్యవస్థకు రూ. 2 లక్షల కోట్లు నగదు వస్తుందని అంచనా. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఈఓ కార్యాలయం పునర్నిర్మాణానికి శ్రీకారం



పాత భవనాన్ని కూల్చివేస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): నంద్యాల మండలం ఎంఈఓ కార్యాలయ భవనం పునర్నిర్మాణానికి అధికారులు చర్యలు చేపట్టారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో 20ఏళ్ల క్రితం నిర్మించిన ఎంఈఓ కార్యాలయ భవనం ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. దీంతో చిన్నపాటి వర్షానికే గదులు మొత్తం కారుతుండటంతో రికార్డులు భద్ర పరుచుకునేందుకు సిబ్బంది నానా ఇబ్బందులు పడుతుండేవారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో రూ.55 లక్షల ఎస్ఎస్ఏ నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో కొత్తగా నిర్మించేందుకు పాత భవనం కూల్చివేత పనులు చేపట్టారు. ప్రస్తుతం ఎంఈఓ కార్యాలయ సిబ్బంది సమీపంలోని పొట్టిశ్రీరాములు మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాల గదుల్లో విధులు నిర్వహిస్తున్నారు.

మనో వికాసమే.. మనిషికి మనుగడ



ప్రభుత్వ వైద్యశాలలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: మానసిక ఆరోగ్యం సరిగా ఉంటేనే మనిషి జీవితం సాఫీగా సాగుతుందని ప్యానల్ న్యాయవాది సరిత అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి వ్యక్తి శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యంపై దృష్టి పెట్టాలన్నారు. శారీరక ఆరోగ్యం బాగున్నా మానసిక ప్రశాంతత లేకుంటే జీవన గమనం లయ తప్పుతుందని సూచించారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

గురురాజ స్కూల్ ఉపాధ్యాయుడికి బెస్ట్ టీచర్ అవార్డు

నంద్యాల(న్యూటౌన్): ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు అన్ ఎయిడెడ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (అపుస్మా) ఆధ్వర్యంలో శుక్రవారం బెస్ట్ టీచర్స్ అవార్డు ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో గురురాజ ఇంగ్లిష్ మీడియం పాఠశాల ఉపాధ్యాయుడు వీరయ్యకు బెస్ట్ టీచర్ అవార్డు వచ్చింది. ఈ నేపథ్యంలో ఈయనను మంత్రి ఫరూక్, అపుస్మా చైర్మన్‌ఛ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి తదితరులు అభినందించినట్లు పాఠశాల డైరెక్టర్ షేక్షావలిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో రామకృష్ణారెడ్డి, బ్యాంకింగ్ కోచింగ్ సెంటర్ అధినేత దస్తగిరిరెడ్డి, ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ విశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.

శెట్టివీడు సర్పంచ్ రాజీనామా

చాగలమర్రి: మండలంలోని శెట్టివీడు గ్రామ సర్పంచ్ లక్ష్మీదేవి తన పదవికి రాజీనామా చేశారు. నంద్యాల డిగ్రీ కళాశాలలో రికార్డు అసిస్టెంట్‌గా విధులు నిర్వహించే ఆమె భర్త పుల్లయ్య కొన్ని నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. కారుణ్య నియామకం కింద ఉద్యోగం, పెన్షన్ తదితర ప్రయోజనాలను పొందటానికి లక్ష్మీదేవి సర్పంచ్ పదవికి రాజీనామా సమర్పించినట్లు ఎంపీడీఓ తాహెర్ హుస్సేన్ శుక్రవారం తెలిపారు.

మహానందీశుడికి పల్లకోత్సవం

మహానంది: క్షేత్రంలో శ్రీ గంగ, శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి దంపతులు శుక్రవారం రాత్రి పల్లకీలో విహరించారు. ఆలయ వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, హనుమంతుశర్మ, శాంతారాంభట్, అర్చకులు ముందుగా స్థానిక అలంకార మండపంలో గణపతిపూజ, అలంకార పూజ, మహామంగళ హారతులు నిర్వహించారు. గోమాతను పట్టువస్త్రాలతో అలంకరించి పల్లకీ సేవ ముందు నడిపించారు.





రుద్రవరం మండలం ఆలమూరు సమీపంలో మొక్కజొన్న పంటలో నిలిచిన వర్షపునీరు, ముకుందాపురం వద్ద వర్షానికి తడిసిన మొక్కజొన్న దిగుబడిని ట్రాక్టరులో తరలిస్తున్న దృశ్యం

వదలని వర్షం

- ముప్పతిప్పలు పడుతున్న రైతన్నలు
- భారీగా దెబ్బతిన్న మొక్కజొన్న పంట

రుద్రవరం: వరుణ దేవుడు వదలడం లేదు. నెల రోజులుగా ప్రతి రోజు ఆళ్లగడ్డ నియోజకవర్గంలో వర్షం కురుస్తూనే ఉంది. దీంతో రుద్రవరం, చాగలమర్రి, శిరివెళ్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు తదితర మండలాల్లో వివిధ పంటలు సాగు చేసిన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మొక్కజొన్న రైతుల దుస్థితి వర్ణనాతీతం. ఈ ప్రాంతంలో ఖరీఫ్ సీజన్‌లో వేలాది ఎకరాల్లో ఈ పంట సాగైంది. ప్రస్తుతం చేతికి రావడంతో రైతులు కోతలు ప్రారంభించారు. ఇదే సమయంలో ఎడతెరిపి లేకుండా వానలు పడుతుండటంతో రైతులకు దిక్కుతోచడం లేదు. ఓ వైపు పంట పొలాల్లో మోకాళ్లలోతు వర్షం నీరు నిలవడంతో కోతలకు ఇబ్బందిగా మారగా మరోవైపు కోసిన దిగుబడులను ఆరబెట్టుకునేందుకు వీలు లేని పరిస్థితి. చాలా మంది దిగుబడులను బయలు ప్రదేశాల్లో, రోడ్లపై ఆరబోయగా శుక్రవారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి అవి తడిసిముద్దయ్యాయి. ఈ ఏడాది పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని, ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఉపాధ్యాయులకు రక్షణ కల్పించాలి



నిరసన తెలుపుతున్న పీఆర్‌టీయూ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): ఉపాధ్యాయులపై దాడులు జరగకుండా రక్షణ కల్పించాలని ఎస్సీ,ఎస్టీ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుబ్బన్న, లక్ష్మణ్ నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గోనెగండ్ల మండలం గాజులదిన్నెలో మండల పరిషత్ పాఠశాల ఉపాధ్యాయుడిపై ఓ విద్యార్థి తండ్రి దాడి చేసి గాయపరచడం బాధాకరమన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

- విద్యాబుద్ధులు నేర్పించే ఉపాధ్యాయుడిపై విద్యార్థి తండ్రి దాడి చేయడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని పీఆర్‌టీయూ నాయకులు అన్నారు. బాధ్యుడిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని లేకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కరుణానిధి, కర్నూలు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణారెడ్డి, ధనుంజయ, రవి, నంద్యాల జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రామపక్కీర్‌రెడ్డి, చాంద్‌బాషా, భాస్కరరెడ్డి ఓ ప్రకటనలో హెచ్చరించారు.
- చాగలమర్రి: గాజులదిన్నె ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న బసవరాజు అనే ఉపాధ్యాయుడిపై విద్యార్థి తండ్రి దాడి చేయడాన్ని తీవ్రంగా పరిగణించాలని పీఆర్‌టీయూ రాష్ట్ర కౌన్సిలర్ రవీంద్రారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం మద్దూరులోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో అంకిత భావం కలిగిన ఒక మంచి ఉపాధ్యాయుడిపై దాడి చేయడం అమానుషమన్నారు. దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మౌళాలి, అంజనేయరెడ్డి, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



కబడ్డీ ఆడుతున్న విద్యార్థినులు

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని నంద్యాల ఎస్‌జీఎఫ్ కో ఆర్డినేటర్ చంద్రవతమ్మ, ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ విశ్వనాథ్, ఉర్దూ చైర్మన్ అస్మోద్దీన్,జిల్లా క్రీడాభివృద్ధి అధికారి రాజు అన్నారు. శుక్రవారం నంద్యాల పట్టణంలోని కేఎస్ఎం మున్సిపల్ క్రీడా మైదానంలో నంద్యాల ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ ఖోఖో, వాలీబాల్, చెస్, యోగా, షటిల్ బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ ఎంపిక పోటీలకు 600 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడాకారులు మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలవాలన్నారు. బాల బాలికల విభాగంలో పోటీలు రసవత్తరంగా జరగడం అభినందనీయమన్నారు. ఎంపికైన క్రీడాకారులను డివిజన్ స్థాయికి పంపుతామని తెలిపారు. ఎంఈఓ శివరాం ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. క్రీడల్లో ప్రతిభ చాటిన వారికి స్పోర్ట్స్ క్రీడా కోటా కింద ప్రభుత్వం ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో ఖలీల్ అహమ్మద్, వ్యాయామ ఉపాధ్యాయులు గోపికృష్ణ, భరత్‌రెడ్డి, రవికుమార్, పద్మారెడ్డి, శేషు, సాల్మాన్, పార్వతి, మహాలక్ష్మి, వెంకట్, సహదేవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రీడలు అవసరమే

శిరివెళ్ల: విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు కూడా ఎంతో అవసరమని ఎంఈఓ నాగార్జునరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక జెడ్పీ పాఠశాల క్రీడా మైదానంలో మండల స్థాయి స్కూల్ గేమ్స్ క్రీడాకారుల ఎంపిక పోటీలు జరిగాయి. ఎంఈఓ ఈ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. 8 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 200 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారన్నారు. డివిజన్ స్థాయి ఆటల పోటీలు ఈ నెల 18న నంద్యాలలో జరగనున్నాయని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం గోవిందరాజులు, మాజీ జెడ్పీటీసీ యామా గుర్రప్ప, మైనారిటీ నాయకుడు బీసీ ఫిధా, పీడీలు షేక్షావలి, శ్రీధర్, రాముడు, రేణుక, సరోజ, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

గెలుపు ఓటములు సహజం

ఉయ్యాలవాడ : క్రీడల్లో గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, ఎంఈఓలు రఘురామిరెడ్డి, వీరప్రతాప్ రెడ్డి క్రీడాకారులకు సూచించారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి క్రీడలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదువుతో పాటు విద్యార్థులు క్రీడల్లో రాణించాలని తెలిపారు. ఈ పోటీల్లో మండల పరిధిలోని హరివరం, మాయలూరు, కొండుపల్లె, బోడెమ్మనూరు, ఉయ్యాలవాడలోని జిల్లా పరిషత్, ఆదర్శ పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు, అలాగే కస్తూరిబా బాలికల పాఠశాల్లోని విద్యార్థినులు పాల్గొన్నారు. కబడ్డీ, వాలీబాల్ ఆటల పోటీలు నిర్వహించారు. మిగతా ఆటలను వచ్చే శుక్రవారం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు విజయకుమార్, మహమ్మద్ షరీఫ్, వ్యాయామ ఉపాధ్యాయులు ప్రతాప్, నరసింహుడు, నాగేంద్ర, కళావతి పాల్గొన్నారు.

నర్సాపురంలో ఎస్‌జీఎఫ్ ఆటల పోటీలు

రుద్రవరం: మండల పరిధిలోని నర్సాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మండల స్థాయి ఎస్‌జీఎఫ్ ఆటల పోటీలు నిర్వహించారు. ఈపోటీలను ఎంఈఓలు వీరరాఘవయ్య, లక్ష్మి ప్రారంభించారు.ఎస్‌జీఎఫ్ కో ఆర్డినేటర్ ధర్మరా జు, ఏపీ మోడల్ పాఠశాల పీడీ శ్రీనివాసులు, ఎర్రగుడిదిన్నె పీడీ దాసు అండర్-14, అండర్-17 కింద బాల బాలికలకు విడివిడిగా కబడ్డీ, ఖోఖో,వాలిబాల్, బ్యాడ్మింటన్, చెస్, యోగా, అథ్లెటిక్స్ తదితర అంశాల్లో పోటీలు నిర్వహించారు. ఇందులో మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన 350 మంది విద్యా ర్థులు పాల్గొన్నారు. పోటీల్లో నైపుణ్యం కనబరచిన వారిని డివిజన్ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ఎంఈఓలు తెలిపారు. కార్యక్రమంలో ఏపీమోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వరరావు వివిధ పాఠశాలల హెచ్ఎంలు రాజ్యలక్ష్మి, రమణారెడ్డి ఉన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈఓ

ఈనెల 15న పీఎం మోదీ గో బ్యాక్



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్‌కుమార్

నంద్యాల(న్యూటౌన్): కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఇచ్చిన హామీలు అమలు చేయలేదని, ఈనేపథ్యంలో ఈనెల ఈ నెల 15వ తేదీన పీఎం మోదీ గోబ్యాక్ పేరుతో నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు వామపక్ష పార్టీల సంఘాల జిల్లా నాయకులు రమేష్‌కుమార్, రంగనాయుడు, బాబాఫక్రుద్దీన్ అన్నారు. శుక్రవారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పై నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్రానికి మేలు చేయడంలో ఘోరంగా విఫలమయ్యాయన్నారు. 8 సంవత్సరాల పాటు ప్రజలను పీల్చి పిప్పి చేసిన జీఎస్టీని తెచ్చింది ప్రధాన మంత్రి మోదేనన్నారు. ఇప్పుడు ఆ జీఎస్టీని కొంత తగ్గించి ఏదో మేలు చేసినట్లు ప్రచారం చేసుకుంటున్నారని మండిపడ్డారు. రైతులను ప్రధాని మోదీ ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. కష్టపడి పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేవన్నారు. సిద్దేశ్వరం అలుగు నిర్మాణం, శ్రీశైలానికి రైల్వే లైన్ ఏర్పాటు, అలాగే ఉమ్మడి కర్నూలు జిల్లా అభివృద్ధికి సహకారం అందించాలని, వీటిపై స్పష్టత ఇచ్చాకే ప్రధాని మోదీ కర్నూలుకు రావాలన్నారు. సమావేశంలో వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు నాగరాజు, లక్ష్మణ్, ఏసురత్నం, రామచంద్రుడు, నరసింహ, బాలవెంకట్, సోమన్న పాల్గొన్నారు.

విజయవాడ ధర్నాను విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న శరత్‌కుమార్

నంద్యాల(అర్బన్): విద్యుత్ సంస్థలో పని చేస్తున్న రెగ్యులర్, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 13న విజయవాడలో ధర్నా నిర్వహిస్తున్నామని, వేలాదిగా తరలి వచ్చి విజయవంతం చేయాలని కాంట్రాక్ట్ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు శరత్‌కుమార్, కార్యదర్శి మధు కోరారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం వారు మాట్లాడుతూ విద్యుత్ సంస్థల్లో కాంట్రాక్ట్ కార్మికులను విలీనం చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. అన్ లిమిటెడ్ హెల్త్ కార్డుల మంజూరుతో పాటు రూ.20 లక్షల రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలన్నారు. కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేసేంత వరకు ఉద్యమిద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సూరియాదవ్, ఉస్మాన్, సుధాకర్ పాల్గొన్నారు.

వెదురు సేకరణ కొనసాగించాలి



రుద్రవరం కలప డిపో వద్ద ఉన్న కూలీలు

రుద్రవరం: నల్లమల అటవీ ప్రాంతంలో వెదురు సేకరణ ప్రక్రియ కొనసాగించి కూలీలను ఆదుకోవాలని మండల కేంద్రమైన రుద్రవరం, హరినగరం గ్రామాలకు చెందిన కూలీలు,లారీ డ్రైవర్లు కోరారు. శుక్రవారం వారు స్థానిక అటవీ కార్యాలయం వద్దకు చేరుకొని మాట్లాడారు. గత 35 ఏళ్లుగా రుద్రవరం, చెలిమ రేంజ్‌లలో అటవీ శాఖ అధికారులు వెదురు వేలం ప్రక్రియ సాగించేవారు. తద్వారా ప్రభుత్వానికి కోట్లాది రూపాయల ఆదాయం రావడంతో పాటు వేలాది మంది కూలీలు లారీలు,ట్రాక్టర్ల యజమానులు, డ్రైవర్లు, కాంట్రాక్టర్లుకు జీవనోపాది లభించేదన్నారు.అయితే గత మూడేళ్లుగా వన్యప్రాణి చట్టం పేరుతో కారిడార్ ఏర్పాటు చేసి వెదురు వేలాన్ని నిలిపేశారన్నారు. దీంతో వాటిపై ఆధారపడిన కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బది పడుతున్నాయని చెప్పారు. అటవీ శాఖ ఉన్నతాధికారులు స్పందించి వెదురు వేలం ప్రక్రియ నిర్వహించి కూలీలను ఆదుకోవాలని వారు కోరారు.

యాజమాన్య పద్ధతులతో తెగళ్లకు చెక్

- జిల్లాలో ప్రారంభమైన శనగసాగు
- జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్త సూచన



నంద్యాల శివారులో శనగ పంట

నంద్యాల(అర్బన్): రబీ సీజన్ ప్రారంభం కావడంతో శనగ పంట సాగు జోరందుకుంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఇది ప్రధాన పంట. దాదాపు 65 వేల నుంచి 70వేల హెక్టార్ల వరకు సాగవుతుంది. అయితే, ఈ పంట విత్తుకునే ముందు రైతులు ముందస్తు యాజమాన్య పద్ధతులపై అవగాహన కలిగి ఉండాలని, లేకపోతే పంట తెగుళ్లబారిన పడుతుందని ఆర్ఏఆర్ఎస్ తెగుళ్ల విభాగం శాస్త్రవేత్త డాక్టర్ చైతన్య తెలిపారు. పంటకు ప్రబలే తెగుళ్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఆయన మాటల్లోనే..

- శనగ పంటకు ఎక్కువగా భూమి ద్వారా సంక్రమించే తెగుళ్లు ఆశించి తీవ్ర నష్టాన్ని కలగజేస్తాయి. ఈ తెగుళ్లలో ప్రధానమైనవి మొదలు కుళ్లు, ఎండు, వేరుకుళ్లు. ప్రస్తుతం అధిక వర్షాల కారణంగా అధిక తేమను నల్లరేగడి నేలలు ఒడిసి పట్టుకొని ఉండటం ద్వారా మొదలు కుళ్లు, తడి వేరుకుళ్లు తెగుళ్ల తీవ్రత ఈ సంవత్సరం రబీ సీజన్‌లో ఎక్కువగా కనిపించే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో శనగ సాగు చేసే రైతులు తప్పని సరిగా కొన్ని యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. మొదలు కుళ్లు తెగులు పంట తొలి దశల్లో ఎక్కువగా వస్తుంది. ఈ తెగులు తీవ్రత నేలలో అధిక తేమ ఉన్నప్పుడు కనిపిస్తుంది. ఈ తెగులు ఆశించిన మొక్కలు పసుపు బారి మొలక దశలోనే చనిపోతాయి. ఇలాంటి మొక్కలను పెరికి చూసినట్లు అయితే వేర్లపై తెల్లని బూజు పెరుగుదల, ఆవగింజ పరిమాణంలో శిలీంద్ర బీజాలు గమనించవచ్చు. తడి వేరుకుళ్లు తెగులు సైతం నేలలో అధిక తేమ ఉన్నప్పుడు వస్తుంది. అయితే, ఈ తెగులు సోకిన మొక్కల వేరు మెత్తగా కుళ్లిపోయి నల్లగా మారిపోతుంది. ఎండు తెగులు శనగ పంటను ఏ దశలోనైనా ఆశిస్తుంది. ఈ తెగులు సోకిన మొక్కలు, ఆకులు పేలమైన ఆకుపచ్చ రంగులోకి మారి చనిపోతాయి. ఈ తెగుళ్ల బారి నుంచి పంటను కాపాడుకునేందుకు శనగ పంట సాగు చేసే పొలాలను పశువుల ఎరువుతో వృద్ధి చేసుకోవాలి. తర్వాత ట్రికో డెర్మా అనే సిలీంద్రనాశిని వేసుకొని కలిపి దున్నితే చాలా వరకు తెగుళ్ల తీవ్రత తగ్గించుకోవచ్చు' అని సూచించారు.

పీఎం సభకు 58 బస్సులు ఏర్పాటు

శిరివెళ్ల: ఈ నెల 16వ తేదీన ప్రధాన మంత్రి మోదీ కర్నూలులో నిర్వహించే బహిరంగ సభకు వెళ్లే వారి కోసం మండలం నుంచి 58 బస్సులు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప అన్నారు. శుక్రవారం సభకు జన సమీకరణపై వెలుగు, ఉపాధి పథకం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సభకు డ్వాక్రా మహిళలు, ఉపాధి పథకం కూలీలు, ప్రజలను తరలించడం జరుగుతుందన్నారు. గ్రామ సచివాలయ సేవా కేంద్రాల ద్వారా ఎంత మందిని సమీకరించాలి, ఎన్ని బస్సులు అవసరంపై నివేదికలు ఇవ్వాలని అధికారులకు సూచించారు. సభకు వచ్చే వారి పూర్తి వివరాలు ఇవ్వాలన్నారు. సమావేశంలో అధికారులు రాజశేఖరరెడ్డి, రామ సుబ్బయ్య పాల్గొన్నారు.

దివ్యాంగుల పెన్షన్ల రీ వెరిఫికేషన్

శిరివెళ్ల: పింఛన్ పొందుతున్న దివ్యాంగుల ధ్రువీకరణ పత్రాల రీ వెరిఫికేషన్ జరుగుతుందని ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప శుక్రవారం తెలిపారు. వివిధ రకాల పింఛన్లు పొందుతున్న దివ్యాంగులకు ఈ ఏడాది ఏప్రిల్, మే, జూన్ నెలల్లో మొదట వెరిఫికేషన్ జరిగిందన్నారు. అయితే అభ్యంతాలు రావడంతో ఈ ప్రక్రియను కొద్ది కాలం నిలిపివేసిన ప్రభుత్వం మళ్లీ తాజాగా ప్రారంభించిందన్నారు. మండలంలో మొదటి విడతగా 68 మందికి నోటీసులు జారీ అయ్యాయన్నారు. నోటీసులను సచివాలయ సిబ్బంది ద్వారా దివ్యాంగులకు అందజేస్తున్నామన్నారు. నంద్యాల, డోన్, బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలల్లో వెరిఫికేషన్ జరుగుతుందన్నారు. ఏ తేదీన, ఏ వైద్యశాలలో వెరిఫికేషన్ జరుగుతుందో నోటీసులో పేర్కొనబడిందన్నారు.



ఉద్ధృతంగా ప్రవహిస్తున్న మాల వాగు (ఫైల్)

వానొస్తే అవస్థలే

- వర్షాకాలంలో పొంగి ప్రవహిస్తున్న వాగులు
- హై లెవన్ వంతెనలు లేకపోవడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారిన వైనం



శిరివెళ్ల- రుద్రవరం రస్తాలో లో లెవెల్ బ్రిడ్జి



ఆర్‌అండ్‌బీ శాఖ ఏర్పాటు చేసిన సూచిక బోర్డు

శిరివెళ్ల: శిరివెళ్ల- రుద్రవరం ఆర్‌అండ్‌బీ రోడ్డుపై వాగులు దాటేందుకు ప్రజలు అష్ట కష్టాలు పడాల్సి వస్తుంది. ఈ రోడ్డుపై మూడు వాగులున్నాయి. ప్రతి ఏటా వర్షాకాలంలో వాగులపై వరద నీరు ప్రవహించి రాక పోకలు బంద్‌వుతున్నాయి. దీంతో శిరివెళ్ల, కాదరబాదర, చిన్న కంబలూరు, పెద్దకంబలూరు, కొండయాయిపల్లె, కొట్టపల్లె గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక మోస్తారు వర్షాలకు వాగులపై మోకాళ్ల లోతు, భారీ వర్షాలొస్తే నడుము వరకు నీరు ఉద్ధృతంగా ప్రవహిస్తుంది. రైతులు, రైతు కూలీలు వ్యవసాయ పనులకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. తుపాను వలన గత కొద్ది రోజులుగా కుస్తున్న వర్షాలకు రెండు రోజుల కితం వాగుపై వరదనీరు పొంగి ప్రవహించింది. దీంతో ఆర్టీసీ బస్‌లు నిలిచిపోయాయి. పోలీస్‌లు వాగుల వద్ద గస్తీ కాశారు. ఎవ్వరు వాగుల వైపు రాకుండా గట్టి చర్యలు తీసుకున్నారు. గతంలో కాదరబాదరకు చెందిన బండారు వెంకట చెన్నయ్య సాయంత్రం వేళ అవసరాల కోసం శిరివెళ్లకు పోయారు. ఆ సమయంలో మొదటి వాగుపై కొద్ది పాటి నీరు ఉండేది. రాత్రి తిరిగి స్వగ్రామంకు పోవటానికి వాగు దాటుతుండంగా నీటి ఉద్ధృతికి కొట్టుకుపోయాడు. 3 రోజులకు గాని మృతదేహం కన్పించలేదు. వాగులపై ఉన్న లో- లెవెల్ బ్రిడ్జీల స్థానాలల్లో హై-లెవెల్ బ్రిడ్జిలు నిర్మిస్తే తమకు రాకపోకలకు ఇబ్బంది ఉండదని శిరివెళ్ల రైతు సుధాకర్, కాదరబాదర వాసి సాయికృష్ణ తెలిపారు.

హైలెవెల్ బ్రిడ్జిలకు ప్రతి పాదనలు పంపాం

శిరివెళ్ల- రుద్రవరం మధ్య 3 వాగులపై హైలెవెల్ బ్రిడ్జిల ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాము. అలాగే రోడ్డు నిర్మాణాలకు కూడా ప్రతి పాదనలు పంపాము. ప్రస్తుతం ఫైనాన్స్ డిపార్టు మెంట్ వద్ద ఈ ఫైల్ ఉంది. **- శ్రీధర్‌రెడ్డి, ఈఈ ఆర్‌అండ్‌బీ**

ప్రతి ఒక్కరికి మానసిక ఆరోగ్యం అవసరం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ

గోస్పాడు: ప్రతి ఒక్కరికి మానసిక ఆరోగ్యం ఎంతో అవసరమని నంద్యాల మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నంద్యాల మెడికల్ కళాశాలలో మానసిక వైద్య నిపుణులు హెచ్ఓడీ డాక్టర్ లోకేశ్వరనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనిషి సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఏదైనా సాధిస్తారన్నారు. ప్రతి ఒక్కరికి శారీరక ఆరోగ్యమే కాకుండా మానసిక ఆరోగ్యం కూడా ఎంతో అవసరమని చెప్పారు. నిజ జీవితంలో ఒత్తిడి లేకుండా పనులు చేసుకోవాలన్నారు. శారీరక అనారోగ్యాలతో పాటు సామాజికంగా ఇబ్బందులు, హడావుడి జీవితం, ఒత్తిడితో బతకడం నేటి సమాజంలో సర్వసాధారణమైందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణకుమారి, ఎస్ఎస్ఏస్ చైర్మన్ డాక్టర్ విజయ కుమారి, డాక్టర్ నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

చింతలచెరువులో ఉచిత పశువైద్య శిబిరం

చాగలమర్రి: రాష్ట్రీయ గోకుల మిషన్ పథకంలో భాగంగా శుక్రవారం మండలంలోని చింతలచెరువు గ్రామంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా 43 పశువులకు గర్భకోశ వ్యాధికి చికిత్సలు అందించినట్లు ఇన్‌చార్జ్ అసిస్టెంట్ డైరెక్టర్ పి.ఎ. ప్రతాప్ తెలిపారు. అలాగే పాడి రైతులకు లింగ నిర్ధారణ వీర్యం, దాని ప్రాముఖ్యతపై అవగాహన కల్పించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు రవీంద్రారెడ్డి, పుల్లయ్య, సాయిబాబా, దీపకుమారి, జూనియర్ వెటర్నరి అధికారి షాజీసహెబ్ తదితరులు పాల్గొన్నారు.



పశువులకు చికిత్స చేస్తున్న వైద్యులు

స్విమ్మింగ్ పోటీల్లో నంద్యాల వాసి ప్రతిభ



ప్రశంసా పత్రం అందుకున్న ప్రభాకర్‌రెడ్డి

నంద్యాల(అర్బన్): ఆంధ్రప్రదేశ్ మాస్టర్స్ స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుంటూరులో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి ఈత పోటీల్లో నంద్యాలకు చెందిన కాశిపురం ప్రభాకర్‌రెడ్డి నాలుగు పతకాలు సాధించారు. ఉమ్మడి కర్నూలు జిల్లా తరపున 50ప్లస్ కేటగిరిలో ప్రాతినిధ్యం వహించిన ప్రభాకర్ రెడ్డి 25 మీటర్లు, 50 మీటర్ల బ్యాక్ స్ట్రోక్‌లో మొదటి స్థానం, 100 మీటర్లు, 50 మీటర్ల ఫ్రీ స్టైల్ ఈవెంట్స్‌లో రెండో స్థానంలో నిలిచారు. ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్న నాలుగు ఈవెంట్స్‌లో పతకాలు సాధించడంతో శుక్రవారం నంద్యాలలో పలువురు ఆయనను అభినందించారు.